# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 14 మార్చి, 2026 | పేజీలు : 08


## వరంగల్ నగరం మత సామరస్యానికి ప్రతీక



**ప్రజాపక్షం/కాజీపేట :** ఫాతిమా నగర్ చర్చి లో నిర్వహించిన ఫాతిమా మాత మహోత్సవ వేడుకల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, క్రైస్తవ మత పెద్దలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ నగరం అనేది ఎప్పటి నుంచో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రజలు పరస్పర గౌరవంతో, ఐక్యతతో జీవించడం వరంగల్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో సోదర భావం, పరస్పర గౌరవాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మానస రాంప్రసాద్,మాజీ కార్పొరేటర్ అబూబకర్,సీనియర్ నాయకులు సెయింట్ పాల్ ఆనంద్,కార్డినల్ పూనా అంతోని,విశ్రాంత బిషప్ జోసెఫ్,పాలనాధికారి ఫాదర్ విజయపాల్,ఫాతిమా చర్చి గురువుకు మర్రెడ్డి స్థానిక క్రైస్తవ మత పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

# పనులు సకాలంలో పూర్తి కాకపోతే ఉపేక్షించేది లేదు

### పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** కాళేశ్వరం క్షేత్రంలో పూర్తి చేయాల్సిన సరస్వతి పుష్కర అభివృద్ధి పనులపై డెడ్ లైన్ పెట్టి అప్పటి వరకు పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి శాఖా పరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం క్షేత్రంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కాళేశ్వరం నుంచి పలుగుల వరకు 22 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 7 కిలోమీటర్ల డబుల్ బీటీ రోడ్డు పనులకు, అదేవిధంగా కాళేశ్వరంలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మ్యూజియం పనులకు, ఆది ముక్తేశ్వర దేవస్థానం నుండి సరస్వతి ఘాట్ వరకు రూ.2 కోట్ల 38 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, 1 కోటి 55 లక్షల రూపాయలతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా కాళేశ్వరం,అన్నారం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. అనంతరం కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాలు మరియు రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన సమావేశానికి ఎస్ఈ స్థాయి అధికారులు హాజరు కాకపోవడం పట్ల మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ‘‘మాకేం పని లేదనుకుంటున్నారా? పుష్కరాల కంటే ముఖ్యమైన పనులు ఏమి ఉన్నాయంటూ అధికారులను ప్రశ్నించారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించిన పనులను అధికారులు సమన్వయంతో మే మొదటి వారం వరకు వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పుష్కర భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, రోడ్లు,పారిశుధ్యం,భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బస్టాండ్ కు చెరువు స్థలం కేటాయించాలని సీసీఎల్ఏ తో ఫోన్ లో మాట్లాడి చెరువు మొత్తం ఎండి పోయింది, పంటలు కూడా సాగు చేయడం లేదని కాబట్టి బస్ స్టాండ్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని సూచించారు.బస్ స్టాండ్ కు కేటాయించిన స్థలం అటవీ శాఖ గెజిట్ లేదు కదా నిర్మాణం పనులకు ఎందుకు ఆటంకం కలిగిస్తున్నారని అటవీ శాఖ అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రానికి రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతుందని బస్ స్టాండ్ లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారని,చెరువు సర్వే చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, వివిధ శాఖలకు కేటాయించిన పనులను నిర్దేశించిన సమయంలో సంబంధిత అధికారులు వారి వారి శాఖలకు కేటాయించిన పుష్కర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ధార్మిక సంస్థ సలహాదారుడు గోవింద హరి, ఎస్పీ సంకీర్త్, అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్తు, పీఆర్, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



### బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం
# నిధులు కేటాయించాలి



### ఎమ్మెల్యే కడియంకు ఎఐఎస్ఎఫ్ వినతి

**ప్రజాపక్షం/జనగామ:** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం 30 శాతం నిధలు కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. విద్యారంగానికి 30 శాతం నిధలు కేటాయించేలా అసెంబ్లీలో ప్రస్థావించాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు కడియం శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్కాలర్‌షిప్స్ విడుదల చేయకపోవడం, ఫీజు రియాంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ కోర్సులు పూర్తి చేసి కూడా ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యారంగానికి అత్యధిక నిధులు కేటాయించడం వలన విద్యార్థులకు న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. కడియంను కలిసిన వారిలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మహమ్మద్ యూనిస్‌తో పాటు జిల్లా నాయకులు పస్తం పృధ్వీరాజ్ పాల్గొన్నారు.

### పశుసంపదను రక్షించేందుకు
# ఉచితంగా ఎఫ్ఎండి టీకాలు

### టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు

**ప్రజాపక్షం/ఐనవోలు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నేడు హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పంతిని గ్రామంలోని పశువుల వైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం నిర్వహిస్తున్న ఉచిత ఎఫ్ఎండీ టీకాల కార్యక్రమాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పశు సంపదను పెంచడం, పశువులను వ్యాధుల నుండి రక్షించడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎఫ్ఎండీ టీకాలను ఉచితంగా వేస్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. పాడి పంట వ్యవసాయానికి అనుబంధంగా ఆవులు, బర్రెల పెంపకం చాలా కాలంగా కొనసాగుతోందని, రైతులు పాడి సంపదను



## ఎస్ఐ అమూల్యను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రెస్‌క్లబ్

**ప్రజాపక్షం/టేకుమట్ల :** భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలానికి బదిలీపై వచ్చి భాధ్యతలు చేపట్టిన నూతన ఎస్ఐ జి అమూల్యను శుక్రవారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బొంగోని నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో విలేకరులు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడి శాలువాతో సత్కరించడం జరిగింది.ఈ సందర్బంగా ఎస్సై అమూల్య మాట్లాడుతూ పోలిస్ స్టేషన్‌లోని వివిధ అంశాల గురించి చర్చించారు.గ్రామలలో జరిగే అంశాలపై అవగహన కల్పించేందుకు తోడ్పడాలన్నారు.చెడు వ్యసనాలకు అలవాటుగా మారిన యువతపై ప్రత్యేక దృష్టి పెడుతానని అక్రమ ఇసుక మాఫియాపై కఠినమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధానకార్యదర్శి గొల్లపెల్లి సంతోష్ గౌడ్,ఉపాధ్యాక్షుడు అంబల కుమారస్వామి,సహాయకార్యదర్శి కన్నూరి రమేష్,ఆర్‌బి న్యూస్ బొంగోని తిరుపతి,పోషల నరేష్,దేవేందర్,కుమార్,సురేందర్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు ఆత్మీయతకు కనువిందు

**ప్రజాపక్షం/టేకుమట్ల :** రంజాన్ పవిత్ర మాస ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లిం సోదరులు పిఆర్ ఎంఆర్ గార్డెన్‌లో ఇఫ్తార్ విందు మండల తహసీల్దార్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ఏర్పటు చేయగా ముఖ్యఅతిథిగా ఎమ్మేల్యే గండ్ర సత్యనారాయణ రావు,సిఐ మల్లేష్ హజరైయ్యారు.ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులు స్వీట్లు ,ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు.ఈ సందర్భంగా ఎమ్మేల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గోనడుకు సంతోషంగా ఉందన్నారు.ఇఫ్తార్ విందు ఆత్మీయత మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు.పవిత్ర రంజాన్ మాస విశిష్టతను గుర్చి కొనియాడారు.అన్ని మతాలు చెప్పేది ఒకటేనని మనుషులంతా సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్,మాజీ జెడ్పిటిసి పులి తిరుపతి రెడ్డి,సర్పంచ్‌లు,గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడతలో అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/కమలాపూర్:** మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు ఉగాది లోపు గృహ ప్రవేశాలు చేసుకోవాలని, అదే విధంగా రెండో విడతలో కమలాపూర్ మండలానికి అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానున్నాయని జిల్లా కార్యనిర్వహణ అధికారి శేషాద్రి అన్నారు. ఫ్రైడే డ్రైడే లో భాగంగా కమలాపూర్ గ్రామాన్ని పరిశీలించడం జరిగింది. మొదట మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించి ఉపాధి హామీ సిబ్బందితో మండలంలో పనికోరిన కూలీలందరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి గ్రామంలో కనీసం 100 నుండి 200 మంది వరకు కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు. ఈ మార్చి నెల మాసంలో కమలాపూర్ మండలానికి నిర్దేశించినటువంటి ఇరవై ఒక్క వెయ్యి పని దినాలు పూర్తి చేయాలని అన్నారు. అనంతరం మార్క మొగిళి గృహ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు, కార్యాలయ సూపరింటెంట్ కరణ్ సింగ్, కమలాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పబ్బు సతీష్, ఏపివో రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## బతకమ్మ చీరలు కార్యాలయల్లో దుమ్ము తినే దుస్థితి!

**ప్రజాపక్షం/నెక్కొండ:** పండగల సమయంలో గొప్పగా ప్రచారం చేస్తూ పంపిణీ చేసిన బతుకమ్మ చీరల అసలు గతి ఇప్పుడు బయటపడింది. నెక్కొండ మండలంలోని ఒక ప్రభుత్వ కార్యాలయంలో గత ప్రభుత్వ కాలంలో పంపిణీ చేయాల్సిన బతుకమ్మ చీరలు గుట్టలుగా పడేసి దుమ్ము పట్టే పరిస్థితి కనిపించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రజలకు పండగ కానుకగా ఇవ్వాల్సిన ఈ చీరలు ఇప్పుడు కార్యాలయ మూలల్లో పాత సామాగ్రిలా మారిపోయాయి. ఎర్రగా గుర్తించిన ప్రదేశంలో చీరలు గుట్టలపై పాత గుడ్డలు, కార్డ్‌బోర్డ్ పెట్టెలు వేసి వదిలేయడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. పండగల సమయంలో ప్రచార హడావుడి చేసిన పథకం ఇప్పుడు ఇలా మూలన పడేయబడడాన్ని చూసి స్థానికులు వ్యంగ్యంగా కార్యాలయాల అలంకరణకా? లేక గోదాముల లేక కార్యాలయాలనే గోదాములుగా మర్చారా? అంటు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల



కోసం తీసుకొచ్చిన పథకాల సామాగ్రి ఇలా దుమ్ము పట్టేలా వదిలేయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్కడ ఉన్న బతుకమ్మ చీరల వివరాలు వెల్లడించి, అర్హులైన మహిళలకు పంపిణీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రచారానికి మాత్రమే పుట్టిన పథకం చివరికి కార్యాలయ మూలల్లో దుమ్ము తినే గుట్టలుగా మిగిలిపోతుందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తేనే డీలర్స్‌ను ఎక్కువగా నమ్ముతారని, రాష్ట్ర అభివృద్ధిలో డీలర్స్ పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ నుండి శివనగర్‌లో గల ది వరంగల్ ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు సభాధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ఎన్నికైన నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయాన్ని కొనసాగించాల్సినటువంటి బాధ్యత డీలర్ల అందరిపైన ఉందని, దీనిని తప్పకుండా పాటించాల్సినటువంటి అవసరం ఉందన్నారు. కార్యవర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ నిర్ణయాన్ని కట్టుబడి, ఆ నిర్ణయం పట్ల మనమందరం కూడా తన వంతు పాత్రను పోషించాలన్నారు. జై జవాన్ జై కిసాన్..నిజంగా మనం కూడా రైతు రాజు కావడానికి మన వంతు పాత్ర ఉందన్నారు. ఫస్ట్ మనం పాటించాల్సింది క్వాలిటీ, రైతుకు మనం వెన్నుదండుగా ఉండాల్సినటువంటి బాధ్యత మనపై ఉందనిన, రైతులకు అందుబాటులో ఉండి నాణ్యమైన విత్తనాలు,



నాణ్యమైన పురుగుమందులు అందించాలన్నారు. క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావద్దని, నాణ్యమైన టువంటి కంపెనీ విత్తనాలు మాత్రమే రైతులకు అందించాలని మీ అందరికి కోరుకుంటున్నానని అన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్ మాట్లాడుతూ డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కు ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉండాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు కూడా పని చేయకూడదని అన్నారు. రాష్ట్ర కోశాధికారి సిద్ధి నాగరాజు మాట్లాడుతూ భవన నిర్మానానికి కావాల్సినటువంటి నిధులను సేకరించి భవన నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొద్దిరెడ్డి నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి, కేదారి, పాండు రంగయ్య, వివిధ జిల్లాల నాయకులు శ్రీనివాస్ లాహోటి, మాడిశెట్టి అశోక్, శేఖర్, రతన్, రాజేందర్ రెడ్డి, రమేష్, రవి, శ్రీను, అమూల్య ప్రవీణ్, సదానందం, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని గోపాలస్వామి గుడి సమీపంలో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ఉదయం స్వామి వారికి పంచవింశతి కలశ స్నపనం అభిషేకం జరిగింది. సాయంత్రం వరంగల్ జిల్లా కోర్టు జడ్జి క్షమ దేశ్ పాండేతో, వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తోట సంపత్ కుమార్, కార్యదర్శి బూరెల సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలనతో వందలాది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. విశ్వక్సెన ఆరాధన, అంకురార్పన, దీక్ష స్వీకరణ, శేష వాహనసేవ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు ఆరుట్ల గోపాలచారి, ప్రదీపాచార్యులు తయ్యాల రాఘవచారి, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, మహిళా భక్తబృందం, భక్తులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాలు విద్యార్థుల ఎదుగుదలకు తొలిమెట్టు



**ప్రజాపక్షం/మహదేవపూర్:** పదవతరగతి ఫలితాలు విద్యార్థుల ఎదుగుదలకు తొలి మెట్టుఅని జిల్లా విద్యాధికారి బి. రాజేందర్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ఫలితాలు విద్యార్థుల ఎదుగుదలకు తొలి మెట్టు అని విద్యార్థులు శ్రద్ధతో చదివి పరీక్షలు వ్రాసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు.ఇష్టంతో కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు.ఈ సందర్భంగా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత సాధించిన విద్యార్థులు జూబియా బేగం, శివాని, తన్మయి, స్నిగ్ధ, మనస్విని, అక్షిత, అంజలి, స్లోహిత్‌లతో పాటు వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాదు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి విజయాన్ని సాధించి పాఠశాల, తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరు తేవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దు మధు, సుధారాణి, సరితా దేవి, ఒలి పాష, శ్రీనివాస్, వసుధప్రియ, సమ్మయ్య, లీలా రాణి, రజిత, ఎండి షాహిదా బేగం, ప్రసూన, పూర్ణిమ, దీపిక, అజ్మత్ పాష పాల్గొన్నారు.

## సిఎం కప్ విజేతకు సన్మానం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** హైదరాబాద్‌లో జరిగిన సిఎం కప్ పోటీలలో కరీమాబాద్ అండర్ రైల్వే గేట్ ప్రాంతానికి చెందిన కివి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు వివిధ పథకాలు సాధించి నగదు పారితోషకాన్ని కూడా గెలుచుకున్నారు. కిక్ బాక్సింగ్ పోటీలలో నల్ల సాత్విక్ ద్వితీయ బహుమతి సిల్వర్ మెడల్ రూ.15వేల పారితోషికం, యోగా పోటీలలో తుమ్మ పవన్ కుమార్ ద్వితీయ బహుమతి, సిల్వర్ మెడల్,రూ. 15వేల పారితోషికం, జుడో పోటీలలో పల్లకొండ సచిన్ బ్రాంజ్ మెడల్ రూ.10వేల పారితోషికం గెలుపొందారు. ఇట్టి పోటీలలో మూడు విభాగాలలో మెడల్, పారితోషికం గెలుచుకోవడం ఆనందంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, యోగా శిక్షకులు జి రవితేజ, బాక్సింగ్ కోచ్ బి సంతోష్, జూడో కోచ్ ఎన్ కుమారస్వామి, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** కొండా దంపతుల ఆదేశానుసారం వరంగల్ నగరంలోని 35వ డివిజన్‌కు చెందిన గౌసియ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నగర కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్ శుక్రవారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండా దంపతుల చొరవతో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు శ్రీరామ్ రాజేష్, పగడాల సతీష్, అక్షిత్ పటేల్, బండి నరేందర్, ప్రియదర్శిని, ముంతాజ్, శ్రీలత, లత, బలరామ్, పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి స్వర్ణను సత్కరించిన సోమలక్ష్మి

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నూతనంగా తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా నియమించబడిన ఎర్రబెల్లి స్వర్ణను వరంగల్ తూర్పు నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సోమ లక్ష్మి ప్రత్యేకంగా శాలువాతో సన్మానం చేసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్ష పదవి విషయంలో కష్టపడే వ్యక్తికి అప్పగించడం ఇప్పుడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా మాజీ మేయర్, మాజీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు అయిన ఎర్రబెల్లి స్వర్ణకు ఇవ్వడం పట్ల వరంగల్ ఉమ్మడి జిల్లా క్యాడర్ అంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచి అవకాశాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ గిరి పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

## మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ క్యాంపు

**ప్రజాపక్షం/మంగపేట :** మండలంలోని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రోగ్రాంలో భాగంగా స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ మలీహా మెహరీన్ పిల్లల డాక్టర్ కిరణ్ కుమార్, ఎముకల డాక్టర్ భాష్యంత్, జనరల్ ఫిజీషియన్ సాయి కిరణ్, కంటి వైద్య నిపుణులు శివ రచన, డెంటల్ డాక్టర్ హరీష్ నిర్వహించారు. మెడికల్ క్యాంపు కు వచ్చిన 282 పేషంట్లకు స్క్రీనింగ్ టెస్టులు చేసి వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి సలహాలు సూచనలు పేషంట్ లకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్స్ తో పాటు డాక్టర్ స్వప్నిత డాక్టర్ అఖిల, డాక్టర్ తరుణ్, పీహెచ్ సి సిబ్బంది పాల్గొన్నారు.

## మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మైనారిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఇందులో భాగంగా మండల మైనారిటీల అభివృద్ధికి రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోటి నలబై లక్షల రూపాయలు మంజూరు చేసారని అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని మదీనా మస్జిద్లో ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో ఉపవాసం విరమింపజేసారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ పరవిత్ర మాసంలో కఠోర దీక్షలతో ఉపవాసం చేస్తారని అన్నారు.పేద ముస్లిం మైనారిటీ లకోసం ప్రభుత్వం రంజాన్ తోఫాలను అందిస్తుందని అన్నారు.ఈ సందర్భంగా రంజాన్ పండుగను ఆనందంగా గడుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్,సీనియర్ నాయకుడు కట్కం అశోక్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మతీన ఖాన్,మదీనా మస్జిద్ అధ్యక్షుడు ముహిద్ ఖాన్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్సార్ ఖురేషీ,వార్డు సభ్యులు హరీష్,నాయకులు పాల్గొన్నారు.

# అక్షర యోధుడు మెండుకు ఘన నివాళి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇటీవల మరణించిన ప్రముఖ కవి, రచయిత, పూర్వ పాత్రికేయుడు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు మెందు ఉమామహేశ్వరరావు శ్రద్ధాంజలి కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం ప్రశాంత్ నగర్ లోని ఒక ప్రైవేటు హాల్ లో అశ్రు నయనాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు, పాత్రికేయులు, బంధుమిత్రులు ఆయన చిత్రపటం ముందు శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు శెంకేసి శంకర్ రావు మాట్లాడుతూ ఉమామహేశ్వర్ తాను పనిచేసిన రంగాలలో క్రమశిక్షణతో, నిజాయితీగా, బాధ్యతాయుతంగా వ్యవహరించేవాడన్నారు. శ్రద్ధాంజలి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గీతా దేవి, హారిక, రఘు, ప్రణయ్, జయశ్రీ, ప్రణీత్, సృజన, ధనలక్ష్మి, కళావతి, సాంబశివుడు, మైమ్ కళాధర్, ఘటించారు.

# యశోద హాస్పిటల్స్‌లో అధునాతన సర్జికల్ పద్ధతులు

**ప్రజాపక్షం/హనుమకొండ:** యశోద హాస్పిటల్స్ లో అధునాతన సర్జికల్ పద్ధతులు అవలంబిస్తున్నట్లు యశోద హాస్పిటల్స్ డాక్టర్ కిరణ్ తెలిపారు. శుక్రవారం హనుమకొండలో మీడియాతో ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్ల చికిత్సల్లో వాడే లేటెస్ట్ టెక్నాలజీ గురించి మరిన్ని వివరాలు అందించారు.రోబోటిక్, ఎండోస్కోపిక్ సర్జరీలు, యశోదలో రోబోటిక్ అసిస్టెడ్ ఎండోస్కోపిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా, అలాగే ఇంట్రాఆపరేటివ్ ఎం ఆర్ ఐ సహాయంతో ట్యూమర్‌ను వీలైనంత ఎక్కువగా తొలగించే అవకాశం ఉంటుందన్నారు.కీహోల్ సర్జరీలు ఎండోస్కోప్ వాడటం వల్ల పెద్ద గాట్లు అవసరం లేకుండా, చిన్న రంధ్రం ద్వారా చేసే కీహోల్ సర్జరీలు నిర్వహించవచ్చని, దీనివల్ల పేషెంట్ త్వరగా కోలుకుంటారన్నారు. నావిగేషన్ సిస్టమ్ ఒక రకమైన గూగుల్ మ్యాప్స్ లాంటిదని, సర్జరీ సమయంలో మెదడులో ఏ భాగానికి వెళ్తున్నాం, ఎక్కడ ట్యూమర్ ఉంది అనేది నావిగేషన్ మెషిన్ ద్వారా ఖచ్చితంగా తెలుస్తుందని, దీనివల్ల మైక్రో క్రానియోటమీ మెదడును పూర్తిగా తెరవకుండా చాలా చిన్న భాగం మాత్రమే ఓపెన్ చేసి చేసే సర్జరీచేయడం సాధ్యమవుతుందని అన్నారు.

# ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించండి

**ప్రజాపక్షం/వేలేరు :** ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మల్లికార్జున ఫర్టిలైజర్ యాజమాని బొజ్జ రాజుయాదవ్ అన్నారు.గురువారం వేలేరు మండలంలోని మల్లికుదుర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గోరంటల రమేష్ ఆద్వర్యంలో 10వతరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని మల్లికుదుర్ల గ్రామ మల్లికార్జున ఫర్టిలైజర్ యాజమాని బొజ్జ రాజుయాదవ్ గ్రామసర్పంచ్ జక్కుల మౌనిక సంపత్‌యాదవ్ ఆద్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, సర్పంచ్ జక్కుల మౌనికసంపత్‌యాదవ్, మల్లికార్జునఫర్టిలైజర్ యాజమాని బొజ్జ రాజుయాదవ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యాయండ్, రషీద్, పిడి రాజేశ్వరి, మాజీ ఎంపిపి రవిందర్‌యాదవ్, వార్డుసభ్యులు గ్రామస్తులుపాల్గొన్నారు.

# విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలి



**ప్రజాపక్షం/ వరంగల్ :** విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లాఖాద్రీ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరవుతున్న అన్ని విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు కనీసం 40 నిమిషాల ముందుగానే చేరుకోవాలని, అవసరమైన రైటింగ్ ప్యాడ్, పెన్నులు, ఇతర పరీక్షలకు అవసరమైన సామగ్రిని వెంట తీసుకురావాలని సూచించారు. ఇంటి నుండి బయలుదేరే ముందు హాల్ టికెట్, ఇతర అవసరమైన వస్తువులు ఉన్నాయో లేదో తప్పకుండా పరిశీలించుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. పరీక్షా హాల్లోకి వెళ్లిన తరువాత ప్రశాంతంగా ఒకసారి ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివి, అనంతరం సమాధానాలు రాయడం ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పరీక్షా కేంద్రాల వద్ద ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ శబ్దాన్ని నియంత్రించడం, విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడడం, విద్యార్థులకు తగిన త్రాగునీటి సదుపాయం కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించాలని ట్రాఫిక్ పోలీసులకు కోరారు.

# చట్టసభల్లో రాజకీయ విలువలను పెంపొందించిన ఓంకార్



**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రస్తుత యుద్ధోన్మాద, మతోన్మాద అవినీతికర నేరమయ ప్రలోభాల రాజకీయాల్లో విలువలను పెంపొందించేందుకు చట్టసభల్లో ఓంకార్ పాత్ర ఎంతో ఆదర్శనీయమని, ఈ క్రమంలో చట్టసభల్లో ఓంకార్ పాత్ర అనే అంశంపై మార్చి 17న హైదరాబాదు రవీంద్ర భారతిలో సభ నిర్వహిస్తున్నట్లు ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. శుక్రవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) ఎంసిపిఐ(యు) వరంగల్ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం కామ్రేడ్ కన్నం వెంకన్న అధ్యక్షతన స్థానిక ఓంకార్ భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ ఓట్లు సీట్లు అధికారం సంపాదనే ధ్యేయంగా రాజకీయ విలువలను భ్రష్టు పట్టించిన విధానాలను నిరసిస్తూ, నీతి నిజాయితీ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీవితాన్ని సర్వస్వం త్యాగం చేసిన మార్క్సిస్టు మహానాయకుడు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ జీవిత చరిత్రను ఆదర్శ రాజకీయాలను చట్టసభలలో ఆయన పాత్రను నెమరు వేసుకునేందుకు ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా మార్చి 17న హైదరాబాదులోని రవీంద్రభారతిలో సభ నిర్వహించడం జరుగుతుందని, దీనికి అధికార ప్రతిపక్ష వామపక్ష పార్టీలు సామాజిక సంఘాల ముఖ్య నాయకత్వాన్ని ఆహ్వానించినట్లు ఈ సభను జయప్రదం చేసేందుకు పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని తగిన విధంగా సమీకరణ చేయాలని కోరారు. వర్గ సామాజిక ప్రజా ఉద్యమాలను ఉధృతం చేసి నీతి నిజాయితీ ప్రత్యామ్నాయ రాజకీయాలను పెంపొందించేందుకు ఓంకార్ అనుసరించిన పద్ధతులను విధానాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సభను జయప్రదం చేసేందుకు పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి మాలోత్ సాగర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుసుంబ బాబూరావు, ముక్కెర రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపుల నిరోధక చట్టం నిర్వీర్యం..రద్దు చేయాలన్న గటక




**ప్రజాపక్షం/నెక్కొండ:** దేశంలో అమల్లో ఉన్న ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్యమైందని, దానిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, మాజీ ఎంపిపి గటిక అజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తీర్పును కాలరాస్తూ ప్రజా ప్రతినిధులు నిస్సిగ్గుగా పార్టీలు మారుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో తీవ్ర అసల్య జరుగుతోందని విమర్శించారు. దీనితో ప్రజాస్వామ్య వ్యవస్థ అపహాస్యం అవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కాగితాలకే పరిమితమైన ఈ చట్టం కారణంగా రాజకీయాల్లో నైతిక విలువలు, జవాబుదారీతనం క్రమంగా తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. అమలు చేయలేని, ప్రజలకు ప్రయోజనం కలిగించని చట్టాలను కొనసాగించడం కంటే వాటిని పూర్తిగా రద్దు చేయడమే ఉత్తమమని గటిక అజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుంటు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న పరిస్థితులపై మేధావులు, ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

# గ్యాస్ కొరతపై అపోహలు నమ్మొద్దు

**ప్రజాపక్షం/నెక్కొండ:** గల్ఫ్ దేశాల్లో యుద్ధ పరిస్థితుల కారణంగా భారత్‌లో ఎల్‌పిజి గ్యాస్, పెట్రోల్ తదితర ఇంధనాల కొరత ఏర్పడుతుందని సోషల్ మీడియా, కొన్ని టివి ఛానళ్లలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా తప్పుడు దుష్ప్రచారమని నెక్కొండ మండలంలోని హెచ్‌పి గ్యాస్ నిర్వాహకులు స్పష్టం చేశారు. ప్రజలు ఇటువంటి వదంతులను నమ్మి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. దేశ ప్రజలకు అవసరమైన ఇంధన సరఫరా ఎక్కడా అంతరాయం కలగకుండా భారత ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రస్తుతం వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని, సాధారణంగా ఎలా బుక్ చేసుకుంటారో అదే విధంగా గ్యాస్ అయిపోయినప్పుడు బుక్ చేసుకుంటే సరిపోతుందని వివరించారు. అయితే సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాల కారణంగా ఒకేసారి వందలాది మంది వినియోగదారులు కాల్ చేయడం, బుకింగ్ ప్రయత్నించడం వలన సర్వర్ బిజీ అవుతూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా శాంతంగా ఉండాలని, గ్యాస్ కొరత గురించి ఎలాంటి భయాలు అవసరం లేదని, అలాంటి పరిస్థితి వస్తే ప్రభుత్వమే పత్రికల ద్వారా తెలియజేస్తుందని, హెచ్‌పి గ్యాస్ నిర్వాహకులు భరోసా ఇచ్చారు. ప్రభుత్వంపై, డీలర్లపై నమ్మకం ఉంచి అనవసరమైన సమయంలో మాత్రమే బుకింగ్ చేసుకోవాలని వారు వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. అనవసర ప్రచారాలను నమ్మకుండా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రజలకు, ప్రభుత్వానికి డీలర్లకు ఇబ్బందులు తలెత్తవని వారు తెలిపారు.

# బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం అందజేత

**ప్రజాపక్షం/రాయపర్తి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్లస్వామి అమ్మమ్మ గుండాల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బదుపాటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి క్వింటా బియ్యం, ఆయిల్ క్యాన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, గజవెల్లి ప్రసాద్, సంధి దేవేందర్ రెడ్డి, యాదవ రెడ్డి, సంపత్ రెడ్డి, లేతాకుల యాకూబ్ రెడ్డి, పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు దయాకర్‌రావు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/రాయపర్తి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఏకే తండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మూడు రవి సోదరుడు మూడు దేవేందర్ వివాహ వేడుకలలో శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటిసి రంగు కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎండి అశ్రఫ్ పాషా, మాలోత్ వసుందర్, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహం, ఐక్యత, సోదర భావానికి ప్రతీక

**ప్రజాపక్షం/హనుమకొండ:** స్నేహం, ఐక్యత, సోదర భావానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ పండుగను హిందూ, ముస్లింలు గంగా—జమునా తహజీబ్ స్ఫూర్తితో కలిసి జరుపుకోవాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరుల కోసం శుక్రవారం హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రత్యేక ఇఫ్తార్ విందును నిర్వహించారు. ప్రతియేటా పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు ప్రత్యేక ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లిం మత పెద్దలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు నిర్వహించారు. సుమారు 2000 మందికి పైగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ ఇఫ్తార్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య,రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్,ఖాజీపేట దర్గా పీఠాధిపతి కుసురు పాషా,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,సుధారాణి హాజరయ్యారు.

# మినీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్

**ప్రజాపక్షం/కొడకండ్ల:** గ్రామంలో నూతన సర్వాయి పాపన్న చౌరస్తాలో ఏర్పాటుచేసిన మినీ బ్యాంక్ సేవలను గ్రామ ప్రజలు అందరు సద్వినియోగం చేసుకోవాలని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ కోరారు. శుక్రవారం ఆమె స్థానిక ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్‌తో కలిసి మినీ బ్యాంక్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని పాలకుర్తి, చెన్నూరు గ్రామాలకు చెందిన కమ్మగాని శ్రీకాంత్ రాజు ఇటీవల మృతిచెందగా శుక్రవారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె వెంట నాయకులు, కుటుంబ సభ్యులున్నారు.

# పాషాను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని మల్లంపల్లిలో ఏబీఎన్ రిపోర్టర్ మహ్మద్ పాషా తండ్రి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతిచెందడంతో మల్లంపల్లిలోని వారి స్వగృహంలో కలిసి పాషా, కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలిపారు. అదేవిధంగా పాలకుర్తి గ్రామానికి చెందిన కమ్మగాని శ్రీకాంత్ మృతిచెందడంతో కటుంబ సభ్యులను మాజీ మంత్రి దయాకర్ పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులున్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

## రాష్ట్ర అభివృద్ధిలో డీలర్స్ పాత్ర కీలకం

**ప్రజాపక్షం/వరంగల్:** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తేనే డీలర్స్‌ను ఎక్కువగా నమ్ముతారని, రాష్ట్రా అభివృద్ధిలో డీలర్స్ పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ నుండి శివనగర్‌లో గల ది వరంగల్ ఫర్టిలైజర్స్,ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు సభా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల ఎన్నికైన నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయాన్ని కొనసాగించాల్సినటువంటి బాధ్యత డీలర్ల అందరిపైన ఉందని, దీన్ని తప్పకుండా పాటించాల్సినటువంటి అవసరం ఉందన్నారు. కార్యవర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ నిర్ణయాన్ని కట్టుబడి, ఆ నిర్ణయం పట్ల మనమందరం కూడా తన వంతు పాత్రను పోషించాలన్నారు. జై జవాన్ జై కిసాన్ నిజంగా మనం కూడా రైతు రాజు కావడానికి మన వంతు పాత్ర ఉందన్నారు. మొదట మనం పాటించాల్సింది క్వాలిటీ. రైతుకు మనం వెన్ను దండగా ఉండాల్సినటువంటి బాధ్యత మన పైన ఉందని, రైతులకు అందుబాటులో ఉండి నాణ్యమైన విత్తనాలు, నాణ్యమైన పురుగు మందులు అందించాలన్నారు. క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావద్దని, నాణ్యమైనటువంటి కంపెనీ విత్తనాలను మాత్రమే రైతులకు అందించాలని మీ అందరికీ కోరుకుంటున్నానన్నారు. విత్తనాన్ని పరిశీలించిన తర్వాతనే మనం రైతుకు అమ్మాలేతప్పా, మన ఏ విత్తనాన్ని గాని, ఏ పురుగుమందు గాని ఏదైనా కూడా ట్రయాల్ చూడకుండా ప్రమోట్ చేయవద్దన్నారు. రైతుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందన్న విషయాన్ని కూడా ఈ సభా సందర్భంగా గుర్తు చేశారు. మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర



స్థాయి వరకు కూడా కమిటీలను పటిష్టం చేయాల్సినటువంటి పరిస్థితి ఉందని, అవన్నీ కూడా జిల్లాల వారిగా ఇంకా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొద్ది రెడ్డి నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి, కేదారి, పాండురంగయ్య, వివిధ జిల్లాల నాయకులు శ్రీనివాస్ లాహోటి, మాడిశెట్టి అశోక్, శేఖర్, రతన్, రాజేందర్ రెడ్డి, రమేష్, రవి, శ్రీను, అమూల్య ప్రవీణ్, సదానందం, మురళి తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించిన కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని నవాబుపేట గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో ఈ నెల 19 నుండి, 31 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు, హాజరుకావాలని, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, కార్యనిర్వహణాధికారి లక్ష్మీప్రసన్న, మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 27 తేదీన శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం సందర్భంగా హాజరు కావాలని, ఆహ్వాన పత్రికను అందజేసి, బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో, జూనియర్ అసిస్టెంట్, రాజిరెడ్డి జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కొల్లూరి శివకుమార్, గ్రామ సర్పంచ్, బూడిద సదానందం, దేవాలయ మాజీ ధర్మకర్త, ముత్తినేని ఉపేందర్, దేవాలయ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యాధికారుల సూచనలు పాటించాలి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** రైతులు పశువైద్యం వైద్యాధికారులకు సూచనలు పాటించి పరిశీలనకు ఎలాంటి రోగాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని షాపల్లి సర్పంచ్ పార్లపల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. శుక్రవారం షాపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గోపాలమిత్రలు రాజు, నగేష్, దివ్య, వార్డు మెంబర్‌లు రాజు, తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంపొందించుకోవాలి

### తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంకు భువనగిరి ఆర్ఎం ఆషాలత

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** ప్రజలందరూ డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకొని ఆర్థిక క్రమశిక్షణతో సురక్షితమైన లావాదేవీలు నిర్వహించాలని తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంకు ఆర్ ఎం ఆషాలత పిలుపునిచ్చారు. దేవరుప్పుల సిఎఫ్ఎల్ ఆధ్వర్యంలో డిజిటల్ పేమెంట్స్ అవేర్నెస్ వారోత్సవాల భాగంగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్బిఐ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న డిజిటల్ పేమెంట్స్ అవేర్నెస్ వారంలో భాగంగా, మండల కేంద్రంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆర్ఎం ఆషాలత మాట్లాడుతూ, రైతులు, మహిళలు, చిన్న వ్యాపారవేతలు, విద్యార్థులు బ్యాంకింగ్ రంగంలోని మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. సైబర్ మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తమ వ్యక్తిగత వివరాలను ఎవరికి తెలుపకూడదని ఆమె సూచించారు. ఖాతాదారులు తమ కేవైసీని వివరా




లను, ఎప్పటికప్పుడు, చెక్ చేసుకోవాలని వారు తెలిపారు. సైబర్ నేరాల, మోసాల పట్ల, ఖాతాదారులు అప్రమత్తంగా ఉండి, బ్యాంకు అధికారులతో, మీ యొక్క వివరాలను తెలుపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల లావణ్య రాజు, ఉప సర్పంచ్ గట్టగల్ల పెద్ద రాజయ్య, టిజిబిఎఫ్ఐసి విష్ణు, టిజిబి బ్యాంకు మేనేజర్, శ్రీనివాస్, ఫైనాన్షియల్ లిటరసి కౌన్సిల్ బీరెల్లి రవివర్మ,, గ్రామ ప్రజలు, బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన ఝాన్సిరెడ్డి



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని కోల్కొండ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీసు శ్రీను కుమారుడు సందీప్ యశస్వినిల రిసెప్షన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి పాల్గొని దంపతులను ఆశీర్వించారు. అదేవిధంగా ధర్మతండాకు చెందిన బానోతు గణేష్ కల్పన దంపతుల రిసెప్షన్‌లో కూడా ఆమె పాల్గొని వారిని ఆశీర్వదించడం జరిగింది. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు యాకస్వామి, గంగరాజు, అనిల్‌కుమార్, పెద్దులు, సత్యనారాయణ, ఆగయ్య, రాజశేఖర్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలున్నారు.

## దుర్గమ్మ గుడి నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండలంలోని బొజ్జతండా గ్రామంలో గ్రామ సర్పంచ్ సుగుణ అధ్యక్షతన దుర్గమ్మ గుడి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. దుర్గమ్మ గుడి నూతన చైర్మన్‌గా అజ్మీర కిషన్ నాయక్, వైస్ చైర్మన్‌గా గాజోటు రాజు నాయక్, కార్యదర్శి భూక్య సుమన్, కోశాధికారిగా అంజయ్య, సహాయ కార్యదర్శిగా భూక్య కిషన్, గౌరవ అద్యక్షులుగా భూక్య తిరుపతి, సలహాదారులుగా జాటోతు భీమ్ సింగ్, జాను నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూక్య జుంలాల్ నాయక్, భీమా, సాంబ బాలు, రాజు, గోపాల్, సిద్ధు, శ్రీను, సోమల, జాటోతు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎర్రబెల్లి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని నీర్మాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కూతడి ఉప్పలయ్య కూతురి వివాహం సింగరాజు పల్లి గ్రామంలో తుమ్మ గార్డెన్‌లో జరుగగా ఆ వివాహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా నీర్మాల గ్రామ వార్డు మెంబర్ నర్సయ్య



కూతురి వివాహం ఇటీవల జరుగగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట నాయకులు సుందర్‌రాం రెడ్డి, దయాకర్‌గౌడ్, రవి, నవీన్, తదితరులున్నారు.

## కోటగుళ్లలో గణపురం ఎస్ఐ అశోక్ పూజలు

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రం లోని ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఇటీవల గణపురం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బొరగల అశోక్ శుక్రవారం పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు వారిని కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండల కేంద్రం లోని, గట్టగల్ల పెద్ద స్వామి, గత కొద్ది రోజుల క్రితం మృతి చెందగా, శుక్రవారం, 8వ వార్డు మెంబర్, ప్యాట మౌనిక యాకయ్య, స్వామి కుటుంబానికి, ఆర్థిక సాయం 25 కిలోల బియ్యాన్ని, అందజేసి, వారి కుటుంబాన్ని



పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో, గట్ట గల్లపెద్ద రాజయ్య, గట్ట గల్లశ్రీహరి, రాగల్ల ఆనంద్, వేముల శీను, బొంకూరి రమేష్, ప్యాట మహేందర్, క్రాంతి, ఎల్లయ్య, చిన్న స్వామి, బర్రె మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఉద్యోగుల చలో హైదరాబాద్‌ను జయప్రదం చేద్దాం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** గ్రామ పంచాయితీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌లతో ఈనెల 17న తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు, పంచాయితి ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్లాచారీ, జేఏసీ రాష్ట్ర మీడియా ఇంచార్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి తేలుకంటి మురళిలు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గతంలో పంచాయతీలలో పనిచేసిన మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రతి నెలా ప్రభుత్వమే వేతనాలు చెల్లించేదన్నారు. వారిని పంచాయతీల నుంచే వేతనాలు తీసుకోవాలనడం విడ్డూరంగా ఉందన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను జీవో 51 నుంచి విముక్తి చేసి పంచాయితి అసిస్టెంట్‌లుగా నియమించాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. వారి వెంట పంచాయితి ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభాకర్, మల్లేశం, శ్రీనివాస్, నాగయ్య, బాలనర్సయ్య, నాగరాజు, వెంకన్న, శ్రీశైలం, తదితరులున్నారు.

## కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని నీర్మాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాసర్ల మల్లారెడ్డి, రవీందర్ రెడ్డి తల్లి సత్తెమ్మ దశదిన కర్మలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు నరేందర్ కొద్ది రోజుల క్రితం మృతిచెందగా వారి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట జిల్లా నాయకులు పల్లా సుందర్ రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్‌గౌడ్, రవి, నవీన్ నాయక్, మండల నాయకులున్నారు.

## పరిసరాల పరిశుభ్రంతోనే ప్రజలకు ఆరోగ్యం

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారానే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అన్ని వార్డులను వైద్య ఆరోగ్య సిబ్బంది, జీపీ పాలక వర్గ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆంజనేయులు, ఉప సర్పంచ్ షన్న, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/పావన్నపేట:**పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఇ నర్సింలు తెలిపారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పదవ తరగతి పరీక్షకు సర్వం సిద్ధం ఎంఇఒ

**ప్రజాపక్షం/రేగోడు:** మెదక్ జిల్లా రేగోడు మండల కేంద్రంలో ని పదివ తరగతి పరీక్షకు సర్వం సిద్ధం పూర్తయిందని మండల విద్యాధికారి గురునాథ్ అన్నారు టి.లింగంపల్లి రేగోడ్ గజవాడ జగ్యిరాల కేజీబీ మోడల్ స్కూల్ లో మొత్తం 194 విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని మండల విద్యాధికారి గురునాథ్ అన్నారు

## వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

**ప్రజాపక్షం /పటాన్‌చెరు :**ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గల శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి శ్రీశైలం, యాదవ్, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి, చిన్న రాములు ,కౌన్సిలర్లు వెంకటేష్, అంజనేయులు ,నాగ భూషణం, గ్రామ పుర ప్రముఖులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మహిళా దినోత్సవం సందర్భంగా జగదేవ్‌పూర్‌లో బిఆర్ఎస్ మండల మహిళ విభాగం మహిళ సభ్యులను ఘనంగా సన్మానించారు. మండల మహిళ విభాగం నాయకులరాలు కొత్త కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై మహిళలను శాలువాలతో సన్మానించారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేస్తున్న సర్పంచ్

**ప్రజాపక్షం/రేగోడు :**మెదక్ జిల్లా రేగోడు మండల కేంద్రంలో ని ఇందిరమ్మ ఇల్లు స్థానిక సర్పచ్ పర్వీన్ స్తుల్తానా చోటు మియి గృహ ప్రవేశం చేశారు అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు .క్రమంలో మంత్రి సూచన మేరకు అధికారులు పనులు ఈ కార్యక్రమంలో రేగోడ్ మాజీ సర్పచ్ మన్నె విజయ భస్కర్ వినతి పత్రం అందించినమాజీ ఎంపిటిసి నరేందర్ నాయకులు కృష్ణ మల్లికార్జున్ శివ కుమర్ నాయకులు పాల్గొన్నారు.

# ఆధారాలు లేవని...లిక్కర్ కేసును కోర్టు కొట్టి వేత



**ప్రజాపక్షం / గజ్వేల్:**లిక్కర్ కేసులో కవితపై ఎలాంటి ఆధారాలు లేవని, సిబిఐ మోపిన అభియోగాలను ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు కొట్టివేస్తూ స్పష్టమైన తీర్పు చెప్పినప్పటికీ కేంద్రం లోని బిజెపి సర్కార్ కు తగిన బుద్ధి రాలేదని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆ సంస్థ లీగల్ సెల్ నేత కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ కేసులో పరువు పోగొట్టుకున్న బిజెపి సిబిఐ ని అడ్డం పెట్టుకొని మళ్ళీ హైకోర్టు పేరిట నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటని నిలదీశారు. అయితే తమకు కోర్టులు, చట్టాలు, న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై సంపూర్ణ నమ్మకం ఉందని, కవితపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినప్పటికీ నిర్దోషిగా బయటపడడం ఖాయమని స్పష్టం చేశారు. ముఖ్యంగా కింది కోర్టుల తీర్పులతో ఉన్నత న్యాయస్థానాలు ఏకీభవిస్తూ తీర్పులు చెబుతుండగా, కవిత విషయంలో కూడా అదే పునరావృతం అవుతుందని తెలిపారు. అయితే సరిహద్దు దేశ ముష్కరుల దాడి, చమురు సరఫరా, ట్రంప్ భారత్ పట్ల చేస్తున్న ప్రకటనలతో దేశ పరువు ప్రతిష్టలు మంటగలుస్తుండగా, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఈ కేసును తిరగదోడుతూ సిబిఐని ఎగదోస్తున్నట్లు విమర్శించారు. సొంత ప్రయోజనాల కోసం సిబిఐ లాంటి రాజ్యాంగ వ్యవస్థలను వినియోగించుకోవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినప్పటికీ బిజెపి అగ్రనేతలకు బుద్ధి రావడంలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని కొందరు బిజెపితో కుమ్మక్కై జాగృతి వ్యవస్థాపకులు కవితను వేధింపులకు గురిచేస్తుండగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న వారి బండారం బయట పెడతామని హెచ్చరించారు. దేశాన్ని సర్వనాశనం చేస్తున్న బిజెపి కుట్రలు, కుతంత్రాలను బహిర్గతం చేసే క్రమంలో అన్ని పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ఏడాదిలో 10కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత నాది

### మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** ఏడాదిలో చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని 10కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.చిల్పూర్ మండల కేంద్రంలోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. ఆ తర్వాత ఆలయ ఈవో అధ్యక్షతన ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ పాలక వర్గంతో దేవాదాయ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాలక వర్గం ఆలయ పాలక వర్గం చైర్మన్ గా పొట్లపల్లి శ్రీధర్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాపై నమ్మకంతో ఆలయ కమిటీ చైర్మన్ గా రెండవసారి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పొట్లపల్లి శ్రీధర్ రావు భక్తి భావంతోనే కాకుండా సేవా భావంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. శ్రీధర్ రావు స్వంత ఖర్చులతో ఆలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లే అని అన్నారు. చిల్పూర్ ఆలయ అభివృద్ధికి 10కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ 10కోట్ల నిధులను ముఖ్యమంత్రి గారిని కలిసి రెండు నెలల్లో మంజూరు చేయిస్తానని తెలిపారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఆలయానికి ఎదురుగా ఇండ్లు నిర్మించుకున్న వాటికీ వేరే చోట ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులు నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామస్తులు సహకరిస్తేనే ఆలయ అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పాలక వర్గ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉంది

### ముస్లీం కబరిస్తాన్ స్థలంకు 50 లక్షలు కేటాయింపు

### మంత్రి వివేక్‌వెంకటస్వామి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ముస్లీం మైనార్టీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడిఉందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈద్గా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందుకు మంత్రి వివేక్‌వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈసందర్భంగా మంత్రివివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ, ముస్లీంలు గంగా.యమునా తహాజిబ్‌ల కలసి మెలసి ఉండాలన్నారు. రాష్ట్రంలో ముస్లీంల సంక్షేమం కోసం ప్రతి ప్రాంతంలో షాదీఖాన, కబరిస్తాన్‌ల ఏర్పాటుకు ఒక్కో ప్రాంతానికి 50 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సిద్దిపేట కబరిస్తాన్ కోసం ముస్లింలు చాల ఇబ్బంది పెడుతున్నారని పలువురు మంత్రి దృష్టికి తీసుకరాగా అనువైన స్థలాన్ని సేకరించాలని ఆర్డీఓకు సూచించారు. గత ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు ప్రభుత్వం ఏంతో వెన్నుదన్నుగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లీంల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మైనార్టీ శాఖ మంత్రి అజారోద్దీన్‌తో చర్చించి సిద్దిపేటలో కుట్టుమిషన్‌లు అందచేస్తామన్నారు. అంతకుముందు మైనార్టీ పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆనంతరం సాముహిక విందును ముస్లీం పెద్దలతో కలసి ఆరగించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూజల హరికృష్ణ, అత్తుఇమామ్, ఆర్డీఓ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ,సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/మనోహరాబాద్:**మనోహరాబాద్ మండల్ మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలోని 13వ వార్డులో పంచాయతీ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఉప సర్పంచ్ ప్రవీణ్ కు మార్ నూతన పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మద్దూరి నాగరాజు గౌడ్, కాలనీవాసులతో కలిసి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎస్పీ కాళిదాస్, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జోన్నోజీ రంగాచారి, నాయకులు నరేందర్ రెడ్డి, వెంకటేష్, శ్రీ పాల్, బాలేష్, పంచాయతీ సెక్రెటరీ ప్రియాంక, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై, స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారుల ప్రత్యేక దాడులు

**ప్రజాపక్షం/నర్సాపూర్:**సివిల్ సప్లై స్పెషల్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక అధికారులు శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని పలు హోటలను రెస్టారెంట్లు, టీ స్టాల్స్ ,ఇతర వాణిజ్య దుకాణాలపై ప్రత్యేక దాడులు చేసి వివిధ కంపెనీలకు చెందిన 46 సిలిండర్లను పట్టుకున్నట్లు సివిల్ సప్లై స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఉమ్మడి మెదక్ జిల్లా, మహబూబ్ నగర్ జిల్లా డిఎస్పి వెంకటేశం తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లై, స్పెషల్ టాస్క్ ఫోర్స్ సీఐ పండరి, ఏఎస్ఓ నిసార్, జిల్లా సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ నర్సింలు, డీటీలు నాగరాజు, గణేష్ తదితరుల బృందం నర్సాపూర్ పట్టణంలోని పలు హోటళ్ల తోపాటు రెస్టారెంట్లు, టీ స్టాల్లు ఇతర వాణిజ్య సముదాయాలలో 29 వాటిలో దాడులు చేయగా గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను, వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్నట్లు తమకు సమాచారం ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెచ్.పీ గ్యాస్ 38 సిలిండర్లు, భారత్ గ్యాస్ 6 సిలిండర్లు, రెండు ఇండియన్ గ్యాస్ సిలిండర్ లను పట్టుకున్నట్టు తెలిపారు. వీటిని స్థానిక హెచ్పీ గ్యాస్ గోదాంకు తరలించినట్లు తెలిపారు. వీటిని వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గ్యాస్ కొరత ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ దాడులు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

## ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల పరిధిలో నస్కల్ ఎంపిపిఎస్ హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో శుక్రవారం రోజున స్వయంపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠశాల విధులను నిర్వహించారు. వీరిలో డీఈవోగా అలోక్ గౌతం, ఎంఈఓ గా సాత్విక్, ప్రధానోపాధ్యాయులుగా హారిక, తమ విధులు నిర్వహించారు. ఉపాధ్యాయులుగా నిశాంత్, అనోకు, గౌతమ్ నంద, నిషాల్, మనీష్, వారి వారికి ఇచ్చిన పాఠ్యాంశాలను విద్యార్థులకు వివరంగా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా టీచర్లకు స్థానిక ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మహిళ టీచర్లతో పాటు వంట మహిళలకు ఆయమ్మలను అందరినీ శాలువాతో ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాగరిక, ఉపాధ్యాయులు సుమలత, మన్మథ, జాకీయా, ఎల్లం, రాజశేఖర్, రాజయ్య, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** పరిసరాల పరిశుభ్రతను ప్రజలు అందరు తప్పక పాటించాలని బైరాన్‌పల్లి గ్రామ సర్పంచ్ బర్మ రాజ మల్లయ్య తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బైరాన్‌పల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. పలువురి ఇండ్లలో పాత గోలాలు, డ్రమ్ములు, టైర్లు మొదలగు వాటిలో నీరునిల్వాలు ఉండకుండా చూడాలని సర్పంచ్, నూతన పాలకవర్గం సభ్యులు సూచించారు. ఈసందర్బంగా సర్పంచ్ మంరియు పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికై కృషిచేస్తామని, ప్రజలకు ఎల్లవేళలా ఆందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

ప్రొఫెసర్ రాజేందర్




**ప్రజాపక్షం/తొర్రూరు:** శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జాతీయ సదస్సు డైరెక్టర్ తొర్రూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాములు అధ్యక్షత వహించగా ప్రొఫెసర్ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కాకతీయ విశ్వవిద్యాలయ వరంగల్ కినోట్ స్పీకర్ రాజేందర్ కట్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఇన్నోవేషన్స్, వ్యాపార, వ్యవసాయ, సాంకేతిక, రసాయన శాస్త్ర విభాగాల్లో, ఫార్మసీ, భాషా, పరిపాలనాత్మక, ఇంజనీరింగ్ వంటి రంగాల్లో ఎన్నో కొత్త విషయాలు కనుగొంటూ యువత భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేటట్లు చేయడంలో తమ వంతు కృషి చేయాలని, అందు కోసం ఈ జాతీయ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వికసిత్ భారత్ 2047 అనే అంశాన్ని తీసుకొని జాతీయ సదస్సు నిర్వహిస్తున్నందుకు డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్‌ను అభినందించారు. ఈ సదస్సు డైరెక్టర్ డాక్టర్ బి.రాములు మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి వచ్చిన వారెవరైనా కంప్యూటర్ పరిజ్ఞానం లేనిది, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహకారం లేనిది నేటి ప్రపంచంలో మనుగడ సాగించడం అసాధ్యమన్నారు. ఈ కళాశాల చరిత్రలోనే ఇది తొలి జాతీయ సదస్సుగా అభివర్ణిస్తూ కమిషనర్‌కు నివేదికలు పంపించిన 15 రోజుల్లోనే కమిషనర్ అనుమతించడంతో పాటు సంబంధిత కరపత్రాలను ఆవిష్కరణకు జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, బాల భాస్కర్ అనుమతించడం, పీఎం ఉష కోఆర్డినేటర్ సౌందర్య రాజన్ సహకారంతో ఈ కార్యక్రమం జరుపుకునేందుకు అనుమతులు లభించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఉన్న ఈ డిగ్రీ కళాశాలలో నేషనల్ సెమినార్ నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రిన్సిపల్ కృషి అభినందనీయమన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శాంతికుమార్ మాట్లాడుతూ ఏఐ లేనిది మనం ఏది సాధించలేమని అభిప్రాయపడ్డారు. కొత్త సంస్కరణలకు యువత ముందుకు అడుగులు వేయాలన్నారు. ఏఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వై.రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్య సాధనలో నిర్దిష్టమైన అంశాల పట్ల పరిశోధనలు సాగించడంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎంతో ఉపకరిస్తుందన్నారు. సదస్సు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.సుజాత మాట్లాడుతూ ఈ సదస్సు జాతీయ సదస్సు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ స్కాలర్, ఫ్యాకల్టీ మెంబర్స్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్, డాక్టర్ ఎ.అజిత్‌కుమార్, డాక్టర్ కె.అరుణ, డాక్టర్ ఎస్.ఉదయలక్ష్మి, డాక్టర్ వి.కాత్య, డాక్టర్ సీహెచ్. సుధాకర్, కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ పార్వతి, డాక్టర్ అంజుమారా, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ వాల్యానాయక్, వై.రవీంద్రారెడ్డి, శ్రీనివాస్, డాక్టర్ విజయ్, సోము, దుర్గాభవాని, హిమబిందు, షహనాజ్ బేగం, రాజేందర్‌రెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపక బృందం, యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ స్టాఫ్ అమరేందర్‌రెడ్డి, రవి, అనిత, దామోదర్, గట్టయ్య, క్రాంతి, దేవేందర్, స్వప్న, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి ఆద్వర్యంలో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా గ్రామ డ్వాక్రా సంఘాల మహిళలు ,వార్డు సభ్యులు గ్రామస్థులతో కలిసి సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, గ్రామ డ్వాక్రా మహిళలు వార్డు సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ బుకింగ్ ఆన్లైన్ మోసాలను నమ్మవద్దు

**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా గ్యాస్ కొరత విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దు, కాల పరిమితి దాటకుండా చేసే గ్యాస్ బుకింగ్ ని అందరికి సమాన సరాఫరా నిమిత్తం తాత్కాలికంగా నిలిపివేయడం జరిగింది. కావున ఎవరు ఆందోళన చెందవద్దు, గ్యాస్ సిలిండర్ గురించి వాట్సాప్ నందు వచ్చే లింకులను క్లిక్ చేసి మోసాలకు గురి కావద్దు. ఎవరైనా అసత్య ప్రచారాలు చేసిన, ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంగించిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాము. అని ఎస్ఐ రాజేష్ తెలిపారు.




# నేటి నుండి పదవ తరగతి పరీక్షలు




సమయానికి హాజరు కావాలి

ఎంఇఒ రవికుమార్

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి (ఎస్ఎస్సి) వార్షిక పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి మండలంలోని ప్రభుత్వ గురుకుల ఆశ్రమ మరియు ప్రైవేట్ పాఠశాలల నుండి మొత్తం 508 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరువుతున్నారు. అందులో 200 మంది జెడ్పీఎస్ఎస్ గూడూరు బాయ్స్ 160 మంది జెడ్పిఎస్ఎస్ గర్ల్స్ 148 మంది గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పరీక్షలు రాస్తున్నారు.మండల పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరువుతున్నారు వాటిలో అరవింద హైస్కూల్ కేజీబీవీ గూడూరు ఎంఎజెపీటీబీడబ్ల్యూ ఆర్ఈఐఎస్ గూడూరు పీఎంఎస్‌హెచ్ఆర్ఐ జెడ్పీహెచ్ఎస్ పోనుగోడు టీజీ టీడబ్ల్యూ ఆర్ఈఐఎస్ హైస్కూల్ దామరవంచ టీడబ్ల్యూ‌ఆశ్రమ హైస్కూల్ గూడూరు ఊట్ల మట్టేవాడ ఆశ్రమ పాఠశాల సీతానగర్ ఆశ్రమ హైస్కూల్ జెడ్పిహెచ్ఎస్(గర్ల్స్)గూడూరు అయోధ్యపురం జెడ్పిహెచ్ఎస్ జెడ్పిహెచ్ఎస్ గూడూరు(బాయ్స్) మాచర్ల జెడ్పిహెచ్ఎస్ తీగలవేణి జెడ్పిహెచ్ఎస్ వంటి పాఠథాలలు ఉన్నాయి. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

**పదవ తరగతి విద్యార్థులు సమయానికి పరీక్షహీలుకు రావాలిఎంఇఒ రవికుమార్**

10 తరగతి విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి రావాలని ఎంఈఓ రవికుమార్ విజ్ఞప్తి చేశారు.ఈసందర్భంగా ఎంఈఓ రవికుమార్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు కూర్చునే ఏర్పాట్లు మురియు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకొవాలని ఒక వేళ ఎవరైనా ఆలస్యంగా వస్తే అనుమతించబోమని ఆయన అన్నారు.అధికారులు విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.అలాగే విద్యార్థులు ఒత్తిడికీ లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రం చుట్టూ 144 సెక్షన్ అమలు చేస్తున్నామని ఎక్కడ కూడా గుంపులు గుంపులు ఉండకూడదని అన్నారు. అదేవిధంగా గూడూరు మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రం సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను ఎగ్జామ్ ముగిసే వరకు మూసి ఉంచాలని ఆయన సూచించారు.

# సర్వం సిద్ధం చేసిన అధికారులు

**ప్రజాపక్షం/పాపన్నపేట:**నేటి నుండే జరుగనున్న పది పబ్లిక్ పరీక్షల నిర్వహణకు మండల విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. పదో తరగతి పరీక్షలు మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. మండలంలోని తొమ్మిది జిల్లా ఉన్నత పాఠశాల తోపాటు ఒక కస్తూరిభ పాఠశాలలోని 550 విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా 6 సెంటర్లలో పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. కాగా మండలంలో 310 మంది విద్యార్థులు, 240 మంది విద్యార్థినులు వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి హాజరు కానున్నారు. కేంద్రాలలో త్రాగు నీటి వసతి తోపాటు ఫ్యాన్లు, మరుగు దొడ్లు, వైద్య సేవలు అందించనున్నట్లు విద్యాధికారి ప్రతాప్ రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ నేటి నుండి జరిగే పది పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 9 నుండి 1 గంట వరకు 144 సెక్షన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పరీక్షల కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.రలు గుడ్లను పరిశీలించి నాణ్యత లోపాలు లేకుండా విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించాలని ఆయా పాఠశాలలలో ఫుడ్ పాయిజన్ లాగా కాకుండా వండిన పాత్రలను కూడా శుభ్రంగా చేసి మళ్లీ వన్ డే టైం లో కూడా శుభ్రపరిచి వంటలు వడ్డించాలని తెలిపారు. అనంతరం పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులతో రేపు జరగబోయే పరీక్షలకు ప్రీ ప్లాన్ గా సమయత్వం కావాలని విద్యార్థులతో సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొమ్మూట బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలకు రూ 2కోట్లు ఎన్ఆర్ఐజిఎస్‌నిధులు

**ప్రజాపక్షం /సంగారెడ్డి :**సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణానికి NREGS నిధుల ద్వారా రూ. 2 కోట్లు మంజూరు అయ్యాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తెలిపారు. మంజురైన ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు రేపటి నుంచే ప్రారంభం కానున్నాయని ఆయన చెప్పారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని ముఖ్యంగా వర్షకాలంలో మట్టి రోడ్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు అందించే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ఇదిలా ఉండగా సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ. 2 కోట్లు నిదులు మంజూరు చేయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా శ్రీ నల్లపోచమ్మ బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం /హత్నూర:**జిల్లాలోని హత్నూర మండల షేర్ఖాన్ పల్లి పలుగుమీది నల్లపోచమ్మ అమ్మవారి బ్రహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం బోనాలు ,అగ్నిగుండాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తువులు ధరించి భక్తి శ్రద్దలతో అమ్మవారికి బోనం సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఓగ్గు కళాకారుల బృంద, అగ్ని గుండాలు కనుల పండుగగా నిర్వహించారు . అనంతరం ఆలయ కార్యనిర్వహణాదికారి దేవనాథం మాట్లాడుతూ భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ పలుగు మీది నల్లపోచమ్మ, అమ్మవారి ఆశీస్సులో షేర్ఖాన్ పల్లి గ్రామ ప్రజలు ,అదే విదంగా చుట్టు ప్రక్కల గ్రామస్తులు ప్రజలు ఆయురారోగ్యాలు ,సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీకాంత్ పంతులు, స్థానిక నాయకులు ,యువకులు మహిళలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## ఆలయ సిబ్బందికి మెమోలు జారీ

**ప్రజాపక్షం/పాపన్నపేట:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయ మంటపం లో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు నలుగురు సిబ్బంది పై వేటు పడింది. గురువారం ఏడుపాయల ఆలయ మంటపం లో జరిగిన జన్మదిన వేడుకలు ఆలయంలో విధులు నిర్వర్తించిన పూజారి తోపాటు మరో ముగ్గురి పై ఇఓ వీరేశం శాఖ పరమైన చర్యలు తీసుకొని నలుగురికి మెమో జారీ చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఏడుపాయలకు చేరుకొని సిబ్బంది తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్ళీ ఇలాంటి సంఘటన చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఆర్ఒ

**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల కేంద్రంగా శుక్రవారం రోజున స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్, జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిత తనిఖీ చేసి పరిశీలించారు. అన్నము కూనేటి నుండే పది పరీక్షలు .



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**ప్రజాపక్షం/రేగోడు:**రేగోడు మండల కేంద్రంలో ని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా రేగోడ్ సర్పంచ్ పర్వీన్ స్తుల్తానా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు ఎక్కువ రోజులు నిలువ ఉంచ వద్దని దాని వల్ల వ్యా ధులు వచ్చే సూచనలు ఉన్నాయని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ చోటుమియి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్లపై అపోహలు నమ్మవద్దు..



**ప్రజాపక్షం/శివ్వంపేట:** ప్రజలు గృహ అవసర గ్యాస్‌పై వస్తున్న అపోహాలు నమ్మవద్దని తహశీల్దార్ కమలాద్రి అన్నారు. శుక్రవారం శివ్వంపేటలోని గ్యాస్ గోదాంను పరిశీలించి సిలిండర్ల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల కొరత ఉందని సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను ప్రజలు నమ్మవద్దని, ఎవరు కూడా ఆందోళన చెంద వద్దని అన్నారు. అవసరమైన సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని మునుముందు కూడా మరిన్ని సిలిండర్ల వస్తాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## భారతీయ కిసాన్ సంఘ్ పిర్యాదు మేరకు స్పందించిన విద్యుత్ అధికారులు

**ప్రజాపక్షం /కొండాపూర్:**రైతు సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ ఇచ్చిన పిర్యాదు మేరకు విద్యుత్ అధికారులు స్పందించారు. కొండాపూర్ మండలంలోని సైదాపూర్ గ్రామంలోని పొలాల్లో ప్రమాదరకరంగా క్రిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను ,స్థంభాలను ట్రాన్స్ ఫార్మర్లను విద్యుత్ శాఖ ఏడి నెహ్రూ ఏడిఈ వీరారెడ్డి గ్రామంలో పర్యటించి విద్యుత్ లైన్ల పరిస్థితిన శుక్రవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రమాదాకరంగా ఉన్న వైర్లను త్వరలోనే సరిచేస్తామని అధికారులు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వారు అడిగి తెలుసుకున్నారు. రైతు సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రదాన కార్యదర్శి పరియాద రామకృష్ణ,రెడ్డి, బిజేఎస్ మండల ఉపాధ్యాక్షులు లక్ష్మణ్ గౌడ్, రామకృష్ణ గౌడ్ తోపాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.



## గ్యాస్ సరఫరాపై ఆపోహలు వద్దు .. గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

### బ్యాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం /సంగారెడ్డి :**జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్ల కొరత ఎక్కడా లేదని వినియోగదారులు ఏలాంటి భయాందోళనలకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టం చేశారు. గ్యాస్ సరపరా సోషల్ మీడియలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆమె సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్యక్షతను జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి జిల్లాలో గ్యాస్ సరపరా పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ వినియోగదాలరుతో పాటు ఆసుపత్రులు ,విద్యాసంస్థలు,ప్రభుత్వ సంస్థలు ,వసతి గృహాలు , అంగన్వాడీ కేంద్రాలు ,వృద్దాశ్రమాలకు, ప్రాదాన్యత క్రమంలో గ్యాస్ సరపరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత పేరుతో నిల్వలు, దాచడం అక్రమంగా మళ్లించడం బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ వినియోగదారులు అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయకుండా నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒక సారి గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కమర్షియల్ అవసరాలకు డోమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగించరాదని, అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రతి రోజు గ్యాస్ బుకింగ్‌లు ,సరఫరా వివరాలను సేకరించి పూర్తి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ మాట్లాడుతూ ఎల్పి జి డిస్ట్రీబ్యూటర్లకు ఏదైన సమస్య ఎదురైతే స్థానిక ఎస్‌హెచ్‌ఓ 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా డొమెస్టిక్ ,కమర్షియల్, గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నట్లు తేలితే కేసులు నమోదు చేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బాల సరోజ ,సహాయ పౌర సరఫరాల అదికారి రాజేశ్వరి సంక్షేమ శాఖల అదికారులు అఖిలేష్ రెడ్డి, జగదీష్, రాజేశ్వర్ అంబదాస్, లలిత కుమారి , డీఈఓ వెంకటేశ్వర్లు ఎల్‌పిజి డిస్ట్రీబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీదర్‌రెడ్డి, సభ్యులు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక ద్వంసం చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలి

### సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/మరిపెడ:**ప్రభుత్వ భుమిలో కట్టిన స్మశాన వాటిక ద్వంసం చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవలనీ సిపిఐ మరిపెడ సమితి తరుపున డిమాండ్ చేశారు.మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండలం నీలికుర్తి రేవిన్యు నేతవత్,పర్కజల్ తండ జిపి పరిదిలోని భజనతండలో ప్రభుత్వ సర్వేనెంబర్ ఆరువైఆరులో,గత ప్రభుత్వం స్మశాన వాటిక నిర్మించింది.దాని పక్కన వున్నా ప్రైవేటు పట్టా భుమి సర్వేనెంబర్ ఆరువైనాలుగు ఏ,బి లో సత్యానారయణ రెడ్డి అనే వ్యక్తికీ ఎనిమిది ఎకరల పదిహేను గుంటల భుమి కలిగి ఉన్నాడు.కాని ప్రక్కనే ఉన్నా ప్రభుత్వ భుమి కూడ తన దాట్లో కలుపుకోనీ,తన భూమి లోనే స్మశాన వాటిక నిర్మించారనీ దౌర్జన్యంగా అధికారుల అనుమతి లేకుండా ప్రభుత్వధనంలో నిర్మించిన స్మశాన వాటికను ద్వంసం చేశాడని,ప్రభుత్వ ఆస్థి ద్వంసం చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమెదు చేయలనీ,సిపిఐ మరిపెడ మండల సమితి తరుపున డిమాండ్ చేశారు.కోద్ది రోజుల క్రితం రెవిన్యు అదికారులు సర్వే చేసి ఓ భూ వివాదంలో అది ప్రభుత్వ భూమి అని తెల్చరనీ,ఇకనైన ఎమ్మర్వో సర్వే రిపోర్ట్ బయట పెట్టలనీ,లేనట్లయితే ఆర్డిఒ,స్థానిక సంస్థల కలెక్టర్ కి నివేదిక ఇస్తామని అన్నారు.ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోనట్లయితే దవలవారి ఉధ్యామాలు చేస్తామని హెచ్చారించారు.ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మల్లేపాక యాకన్న,జిల్లా కౌన్సిల్ సభ్యులు ఏండి అబ్దుల్ రషీద్,లింగన్న,తదితరులు పాల్గోన్నరు.

## ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించాలి



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను తక్షణమే ప్రారంభించాలని సీపీఎం నాయకలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈమేరకు శుక్రవారం గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు.ఈసమావేశానికి మున్యం మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఎం గూడూరు కొత్తగూడ గంగారం ఏరియా కమిటి కార్యదర్శి నక్క పైదులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించకపోవడం వల్ల స్థానిక కూలీలు ఏపాధి కోసం దూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 2005లో వామపక్ష పార్టీల పోరాట ఫలితంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చిందని తెలిపారు.గ్రామీణ ప్రజలు తమ నివాస ప్రాంతాల్లోనే ఉపాధి పోందెలా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని ఉద్దేశించినప్పటీ ప్రస్తుతం పథకం అమలు తీరుపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని వివర్శించారు. వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పనులు జరిగే ప్రాంతాల్లో కూలిలకుటెంట్లు,తాగునీరు మెడికల్ కీట్లు అవసరమైన పనిముట్లు వంటి మౌలిక సౌకర్యాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అయితే చాలా చోట్ల అవి అందుబాటులో లేవని అన్నారు.గతంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు పెండింగ్ లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించపోతే ప్రజలను పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకలు అద్దూరు బ్రహ్మాచాకరి మున్యం మల్లేష్ కరుణాకర్ నరేష్ వెంకన్న వీరన్న తదితరులు పాల్గోన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తాం




**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండలంలో తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుండి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించాలని గౌరవ మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహిస్తామని ఎమ్మార్వో తహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటవెంటనే పరిష్కారం చేస్తామని ఆయన పిలుపునిచ్చారు.

## శ్రీవిద్య పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

### ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు

**ప్రజాపక్షం/పాపన్నపేట:**మండల కేంద్రమైన పాపన్నపేటలోని శ్రీవిద్య పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం శుక్రవారం నాడు నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కలెక్టర్ గా శివాని, డీఈవో సునయన, ఎంఈఓ హర్షిత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులుగా శ్రీనాథ్, ఉపాధ్యాయులుగా యశస్వి, నిహారిక, రేహమాన్, వర్షిని పాటిల్, ఆదర్శ్, సుమయ, కీర్తన, దీక్షిత భవ్య శ్రీ, దీక్షిత, సోఫియాన్, మనోజ్, దీపక్ గౌడ్, వేణు సాగర్ తోపాటు 57 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. దీనితో పాఠశాల ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. బోధనలో ప్రతిభా కనబరిచిన వారికి ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి సేవలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

**ప్రజాపక్షం/రామాయంపేట:**రామాయంపేట, కాట్రియాల గ్రామాల్లో జరుగుతున్న పెద్దమ్మ అమ్మవారి వార్శికోత్సవ ఉత్సవాల్లో బాగంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి అద్వర్యంలో మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి అమ్మవారి సన్నిదిలో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాదాన్యత ఇస్తుందన్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ముదిరాజ్ కులస్థులు బోనాల ఊరేగించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు బైరం స్వప్నకుమార్, పుట్టి సందీప్, గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, డాకి శ్యామల స్వామి, నాయకులు సరాపు యాదగిరి, దేమె యాదగిరి, రంగ రాజాకిషన్, కాట్రియాల సర్పంచు కొత్త స్రవంతి రాజేందర్‌గుప్తా, ముదిరాజ్ సంఘం నాయకులు గుడాల లింగం, పోచమ్మల సిద్ధరాములు, అబ్రమైన గంగరాములు, రెడ్డమైన నరేష్, పోచమ్మల కిషన్, సార్గు బాగయ్య, అక్కల సిద్దరాములుతో పాటు కాంగ్రేస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నా.



## పది పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పదవ తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సెంట్రల్ డీసీపీ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 150 పరీక్ష కేంద్రాల్లో( హన్మకొండ 64,వరంగల్ 47, జనగామ 39) రేపటి నుండి ఏప్రిల్ 16 నుండి 2026 వరకు ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని డీసీపీ తెలిపారు.పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు నిషేధం అని, పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది రేపటి నుండి ఏప్రిల్ 16 నుండి 2026 వరకు ప్రతిరోజూ ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు మూసివేయాలని డీసీపీ ఆదేశించారు.ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని డీసీపీ హెచ్చరించారు.

## విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

**ప్రజాపక్షం/నడికూడ :** విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా కష్టపడి చదివి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి,పాఠశాలకు, గ్రామానికి,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ కోంగంటి తిరుపతి సూచించారు.హనుమకొండ జిల్లా నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామ జిల్లా పరిషత్ ప్రాథమిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వేరోస్ జిల్లా మాజీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు,పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేసిన సర్పంచ్ కోంగంటి తిరుపతి,మొదట విద్యార్థులకూ హాల్ టికెట్స్ అందజేసి అల్ ది బెస్ట్ తెలియజేసారు.సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమ శిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చునని పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని,పరీక్ష సమయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. స్వేరోస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మాదారపు నవీన్,పాఠశాల హెచ్.ఎం ప్రణిత రెడ్డి,ఉపాధ్యాయులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షకేంద్రాలు రెండు సెంటర్లలో ఏర్పాటు

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**మండల విద్యాశాఖ అధికారి దివాకర్ మీడియాతో మాట్లాడుతూ రేపు జరిగే పదవ తరగతి పరీక్షలకు మవడలంలో రెండు సెంటర్లును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు ఒకటి జెడ్పి హెచ్ఎస్ పసరనాగారం సెంటర్లలో బాలురు 73 బాలికలు 77 మొత్తం 150మంది పిల్లలు 2వ సెంటర్ గవర్నమెంట్ హైస్కూల్ గోవిందరావుపేట లో బాలురు 62 బాలికలు 75 మొత్తం 137 మంది పిల్లలు రెండు సెంటర్లలో మొత్తం 287 మంది పిల్లలు పరీక్షలు వ్రాయడం జరుగుతుందని సెంటర్లలో అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని సెంటర్లలో అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని సెంటర్లలో అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని పరీక్షా కేంద్రంలో ఇద్దరు చీఫ్ సూపరింటెంట్లు ఇద్దరు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు 18 మంది ఇన్విజిలేటర్లను నియమించారని తెలిపారు. పరీక్షా సమయం ఉదయం 9.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12.30 వరకు ఉంటుంది విద్యార్థులు 30 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

## ఆకట్టుకున్న నమూనా ఐక్యరాజ్యసమితి

**ప్రజాపక్షం/ములుగుః** ములుగు జిల్లా పాఠశాల విద్యాశాఖ, జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లాలోని పిఎం శ్రీ పాఠశాలల 6 నుండి 9వ తరగతి విద్యార్థులతో తెలంగాణ మోడల్ స్కూల్ చల్వాయిలో జిల్లా స్థాయి మోడల్ ఐక్యరాజ్య సమితి, సెల్ఫీ, క్విజ్ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్లానింగ్ హర్షం రాజు, కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ సాంబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తూ ఐక్యరాజ్య సమితిలో కూడా ఉద్యోగాలు చేసే విధంగా మాట్లాడే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆయుష్ మందుల నాణ్యత, సరఫరాపై లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఆయుష్ వైద్య సంస్థల్లో మందుల నాణ్యత, నిరంతర సరఫరాపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాల్లో వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుష్ కేంద్రాల్లో మందుల నాణ్యతపై ఎలాంటి తనిఖీలు నిర్వహించారో వివరాలు ఇవ్వాలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖను ఎంపీ కోరారు.అలాగే ఆయుష్ వైద్య కేంద్రాల్లో సరఫరా అయ్యే మందులపై సంవత్సరం వారీగా చేసిన తనిఖీలు, సేకరించిన నమూనాలు, పరీక్షల ఫలితాలు, నాసిరకం లేదా నకిలీగా తేలిన మందుల వివరాలు తెలియజేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని తయారీదారులు లేదా సరఫరాదారులపై తీసుకున్న చర్యలు — లైసెన్స్ సస్పెన్షన్, రద్దు, బ్లాక్‌లిస్టింగ్, బకాయిల వసూళ్లు, కేసులు నమోదు వంటి చర్యలపై వివరాలు కోరారు.అదేవిధంగా, ఆయుష్ మందుల కొరత లేకుండా ఉండేందుకు నేషనల్ ఆయుష్ మిషన్ (నామ్) లేదా ఇతర కేంద్ర పథకాల కింద డిజిటల్ స్టాక్ మానిటరింగ్ వ్యవస్థ అమలు చేస్తున్నారా అనే అంశంపై కూడా ఎంపీ ప్రశ్నించారు.దీనికి సమాధానంగా కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ మాట్లాడుతూ ప్రజారోగ్యం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే అంశమని తెలిపారు. తెలంగాణలోని వరంగల్ సహా అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రులకు నాణ్యమైన మందుల సరఫరా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం ఆయుష్ విభాగం ద్వారా మందుల నమూనాలను యాదృచ్ఛికంగా, బ్యాచ్ వారీగా సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయుష్ వైద్య వ్యవస్థ బలోపేతంపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## ఆలయ అభివృద్ధికి 10 కోట్లలో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలి

**ప్రజాపక్షం/జనగామ:** తెలంగాణ తిరుపతి చిల్పూరు శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవాలయం అని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. 10 కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగంది. ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి కడియం శ్రీహరి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఆలయ పాలకవర్గం ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఎంతో భక్తి శ్రద్దలతో దేవాలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. శ్రీదర్‌రావు తన సొంత డబ్బులో ఆలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన, శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఓ ప్రత్యేకత ఉందన్నారు. చిల్పూరు శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే తిరుపతి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నంత అనందరం భక్తులకు కలుగుతుందన్నారు. చిల్పూరు ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపడితే దేవస్థానం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ తయారు చేస్తే తాను స్వయంగా ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తెప్పిస్తానన్నారు. ఆ నిదులతో అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అభివృద్ధికి గ్రామస్తులు సహకరంచాలని కోరారు. ఆలయానికి ఎదురుగా ఇళ్లు నిర్మాణం చేసుకున్న వారికి వేరే చోట ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే ఆలయ భూములు అన్యాక్రాంతం అయ్యాయని హద్దులు నిర్ణయించి పెన్షింగ్ నిర్వయించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ తన శక్తివంచన లేకుండా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న,పాలకమండలి సభ్యులు, దేవాలయ శాఖ అధికారులు, ఆలయల అర్చకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



## మెగా హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/వేలేరు :**తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు,ప్రజాపాలన ప్రగతి ప్రణాలిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో బాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్,జిల్లా వైద్యఆరోగ్య శాఖ లధికారి డా,అప్పయ్య ఆదేశాను సారం ఈనెల 16 వతేదీన వేలేరు మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించబోయే మెగాహెల్త్ క్యాంప్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డా,నవీన్‌కుమార్ తెలిపారు.శుక్రవారం వేలేరు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఇందులు ముఖ్యంగా ఆరు రకాల స్పెషలిస్టు డాక్టర్లు స్త్రీల వైద్య నిపుణులు,చిన్నల్ల వైద్యలు,మోకాల్లకు సంబందించిన ఆర్థోపెడిక్ వైద్యలు,కండ్ల వైద్యలు,దంత వైద్యలు రావడం జరుగుతుంది కనుక మండల ప్రజలు సుధీర్గ జబ్బులకు గురైనా,ఇతర అనేక రకాల జబ్బులకు గురైనా సరే మీయొక్క ఆధార్ కార్డుతో వచ్చి మీయొక్క ఆరోగ్య సమస్యలను పరీక్షించుకొని తగిన చికిత్సను చేయించుకొని మందులు తీసుకువెల్లాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాలలోని ఆర్ఎంపి,పిఎంపి వైద్యలను ఆశ్రయించడం వలన వారు రాసే హెవి డోసులతో ఇంకా ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయనే సమాచారం ఉన్నప్పటికినీ వారినే ఆశ్రయించడం సరైందికాదని అన్నారు.ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అర్హులైన వైద్య సిబ్బంది సకాలంలో చికిత్సను అందించడం జరుగుతోంది కనుక వారి సేవలు సద్వినియోగం చేసుకోవడమేకాకుండా ఈనెల 16న వేలేరు మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించే మెగాహెల్త్ క్యాంప్‌కు వివిధ స్పెషలిస్టుల వైద్య బృందం వస్తున్నందున వేలేరు మండలంలోని వివిధ గ్రామపంచాయితీల పాలక వర్గం ప్రత్యేక చొరవ చూపి ప్రజలకు అవగాహన కల్పించేందుకు దండోర లాంటి కార్యక్రమాలను వేయించి మెగా హెల్త్ క్యాంప్‌ను విజవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో డా,నవీన్‌కుమార్,హెచ్ఇఒ వెంకటేశ్వర్లు,హెచ్‌వి ప్రభావతి పాల్గొన్నారు.



## జంపన్న ఆధ్వర్యంలో, ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/తాడ్వాయిః** బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిభిరం ద్వారా చికిత్స పొందిన పలువురు రోగులు కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసుకొని శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జంపన్న వారిని ఆత్మీయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ నెల 11వ తేదీన తాడ్వాయి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా కంటి వైద్య శిభిరంలో కంటి సమస్యతో బాధపడుతున్న పలువురిని ఎంపిక చేసి హైదరాబాద్‌కు తరలించి నిపుణులైన వైద్యులు ద్వారా ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్లు విజయవంతంగా పూర్తయ్యాక రోగులు తిరిగి తాడ్వాయికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలో మారుమూల గ్రామాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇప్పటి వరకు 26 విడతలుగా ఉచిత కంటి వైద్య శిభిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిభిరాల ద్వారా సుమారు 16వేల పైచిలుకు మందికి బిపి, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించామని చెప్పారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలను గుర్తించి ఇప్పటి వరకు 3284 పైచిలుకు మందికి విజయవంతంగా కంటి ఆపరేషన్లు చేయించామని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత మెగా కంటి వైద్య శిభిరాలను కొనసాగిస్తూ కంటి చూపుతో ఇబ్బంది పడుతున్న పేదలకు నిరంతరం సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని జంపన్న తెలిపారు. జంపన్న చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలకు స్థానిక ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.



## కేసులను నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/ములుగుః** కేసులను నిష్పాక్షపాతంగా విచారణ చేపట్టి సామాన్య ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూడాలని ములుగు జిల్లా ఎస్పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి క్రైమ్ రివ్యూ సమావేశం ఎస్పి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ములుగు, ఏటూరునాగారం డివిజన్లకు చెందిన ఎస్‌డిపిఓలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పి జిల్లాలో పరిష్కరించబడని కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అలాగే నేర తీవ్రత ఎక్కువ కలిగిన కేసులు, ఆస్తి సంబంధిత కేసులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి మనన్ బట్ ఐపిఎస్, అదనపు ఎస్పి సదానందం, డిఎస్పి కిషోర్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌స్పెక్టర్ శంకర్, పస్రా సిఐ దయాకర్, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్, వెంకటాపురం సిఐ ముత్యం సురేష్, జిల్లాలో గల ఎస్ఐలు పాల్గొన్నారు.

## లీకేజీలతో వృథాగా పోతున్న నీరు

**ప్రజాపక్షం/ములుగుః** ములుగు వెంకటాపూర్ మండలం లింగాపూర్ గ్రామంలో త్రాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సర్పంచ్, కార్యదర్శులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గత కొద్ది రోజులుగా పైప్‌లైన్ నుండి త్రాగునీరు వృధాగా పోతున్న పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. లీకేజీల వలన తాగునీరు వృధాగా పోవడం వలన ప్రతి ఇంటికి త్రాగునీరు అందడం లేదని లీకేజిల వద్దనే పోతుందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సర్పంచ్, కార్యదర్శి చొరవ తీసుకొని గ్రామ అభివృద్ధి కొరకు కార్యక్రమాలు చేపట్టాలని వృధాగా పోతున్న నీరును లీకేజీలు వెంటనే పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు అంటున్నారు.